# ఆటో షో అదుర్స్



- హెచ్‌ఐసీసీలో ప్రారంభించిన సీఎం
- ప్రత్యేకంగా వింటేజ్ సొగసులు
- 25 వరకు కార్ల ప్రదర్శన

మేజర్‌న్యూస్ : అందమైన కార్లను చూస్తే హృదయం ఉప్పొంగుతుంది. అందరూ కార్లు కొనలేకున్నా వాటిని కనీసం కళ్లారా చూడాలని తహతహలాడతారు. కంటికి నచ్చిన వాటిని అబ్బో ఎంత బాగుందో అని అనుకుంటారు. ఇక వింటేజ్ వాహనాల దర్పం చూస్తే ఔరా అని తప్పక అనిపిస్తుంది మరి. ఈతరుణంలో నగరంలోని మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీలో అటోషో ప్రారంభమైంది. ఈ ప్రదర్శనను ముఖ్యమంత్రి రోశయ్య గురువారం ప్రారంభించారు. ఈ నెల 25వ తేదీ వరకు ఈ ప్రదర్శన జరుగుతుంది. హైటెక్స్‌లోని ఆటోషోలో రోల్స్‌రాయి స్‌తోపాటు జాగ్వార్ ల్యాండ్ రోవర్, స్కోడా, టయోటా, బీఎండబ్ల్యూ, నిస్సాన్, వోల్వో, ఫోక్స్‌వ్యాగన్, మెర్సిడెస్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఫియట్, హోండా, జనరల్ మోటార్స్, టాటా,మారుతీ, హుందాయ్, ఫోర్డ్ తదితర కంపెనీలు తమ కొత్త కార్లను ఏర్పాటు చేశాయి. అలాగే ద్విచక్రవాహన కంపెనీలు హీరోహోండా, బజాజ్, టీవీఎస్, యమహా, రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థలు తమ వాహనాలను ప్రదర్శిస్తున్నాయి. జాగ్వార్, ల్యాండ్‌రోవర్, రోల్స్‌రాయిస్, నిస్సాన్ వంటి విదేశీ కార్లతోపాటు స్వదేశీ కంపెనీ కార్లు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సికింద్రాబాద్ ఎమ్మెల్యే జయసుధ కపూర్‌తోపాటు పలు కార్ల కంపెనీల ప్రతినిధులు, సంస్థల యజమానులు పాల్గొన్నారు.





### కనువిందు చేస్తున్న వింటేజ్ వాహనాలు

దక్కన్ హెరిటేజ్ ఆటోమొబైల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ షోలో కళ్లు చెదిరే హెరిటేజ్ వాహనాలను ప్రదర్శిస్తున్నారు. అశ్విన్ యత్రబతి, దేవిన్ రాజులకు చెందిన 1934 డైమ్లర్, 1947 ఇండియన్ చెఫ్ వాహనాలు ఇందులో కొలువుతీరాయి. అలాగే 1936 ఎంజి రోడ్‌స్టార్, 1932 డోడ్జ్ బ్రదర్స్, 1945 విల్లీస్ సివిలియన్ జీప్, 1952 నార్టన్ డోమినేటర్, 1956 లాంబ్రెట్టా ఎల్‌డి 150, 1918 త్రిముఖ్ వాహనాలు ఉన్నాయి. వింటేజ్ కార్, మోటార్‌సైకిల్ ర్యాలీ ఆగస్టు 15వ తేదీ లుంబినీ పార్కు వద్ద జరుగుతుందని దక్కన్ హెరిటేజ్ ఆటోమొబైల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ. జితేంద్రనాథ్ తెలిపారు.

గురువారం హెచ్‌ఐసీసీలో అంతర్జాతీయ వాహన ప్రదర్శనను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి రోశయ్య, చిత్రంలో జయసుధ ఉన్నారు. కనువిందు చేస్తున్న వింటేజ్ వాహనాలు కొలువుతీరిన పలు కంపెనీల కార్లు



# సందడే...సందడి !

- విశ్వేశ్వరయ్య భవన్‌లో 'క్యాబ్' ఎడ్యుకేషన్ ఫెయిర్
- ఎంసెట్ ర్యాంకర్లకు మంచి అవకాశం



మేజర్‌న్యూస్, సిటీబ్యూరో : విద్యార్థులు ఏ కోర్సుల్లో చేరాల్లో తెలుసుకునేందుకు పోటీపడుతున్నారు. ఏ కళాశాలలో ఏ కోర్సులు ఉన్నాయో సులభంగా తెలుసుకునేలా ఏర్పాటు చేసిన ఎడ్యుకేషన్ ఫెయిర్‌కు మంచి స్పందన లభిస్తోంది. ఎంసెట్‌లో లభించిన ర్యాంకుల ఆధారంగా వారు అభ్యసించాలనుకున్న ఉన్నత విద్యతోపాటు అవి అందిస్తున్న అనువైన కళాశాలలను ఎంచుకునేలా క్యాబ్ ఎడ్యుకేషన్ కన్సల్టెంట్స్ ఆధ్వర్యంలో ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన ఎడ్యుకేషన్ ఫెయిర్ గురువారం విద్యార్థులతో సందడిగా మారింది. జంటనగరాల్లోని పలు కళాశాలలు ఇందులో స్టాల్స్ ఏర్పాటు చేశాయి. ఈ ఫెయిర్ 23వ తేదీ వరకు జరుగుతుందని క్యాబ్ సంస్థ డైరెక్టర్ కె. వెంకటేష్ తెలిపారు. ఉదయం 10గంటల నుంచి రాత్రి 7గంటల వ రకు ఈ ఫెయిర్‌ను నగరవాసులు సందర్శించవచ్చు.



బుధవారం ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవన్‌లో క్యాబ్ ఎడ్యుకేషన్ ఫెయిర్‌ను ప్రారంభిస్తున్న జెఎన్‌టియు వైస్‌ఛాన్స్‌లర్ బి.ఎన్ రెడ్డి

# రాయల రాజ్యమే దేశానికి మార్గదర్శకం

**హంపి విరూపాక్ష పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి**



మేజర్‌న్యూస్, సిటీబ్యూరో – దేశానికి సంస్కృతి, సంప్రదాయాలే ప్రధాన ఆధారమని, ప్రజలు శ్రద్ధాసక్తులతో సాంప్రదాయాలను ఆచరిస్తే దేశం వికసిస్తుందని, ఇందుకు శ్రీ కృష్ణ దేవరాయల వారి పరిపాలనే ఉదాహరణ అని హంపి విరూపాక్ష పీఠాధిపతి జగద్గురు శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతి స్వామి అభిభాషణ చేశారు. శ్రీ కృష్ణదేవరాయల పట్టాభిషేక పంచశతాబ్ది ఉత్సవాల సందర్భంగా పరివ్రాజకులు విద్యారణ్య భారతి స్వామిజీ గురువారం కళాభవన్‌ని సాంస్కృతిక మండలి కార్యాలయానికి విచ్చేసి నారాయణ పూర్వక ఆశీర్వచనాలు అందించారు. రాయల వారి పాలన సాంస్కృతికంగా, రాజనీతి వైభవంగా వర్ధిల్లిందని, రాయల రాజ్యమే దేశానికి ఒక రోల్‌మోడల్ కావాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తలపెట్టిన శ్రీకృష్ణదేవరాయల పట్టాభిషేక మహోత్సవాలు గొప్ప శుభసూచకమని స్వామిజీ అన్నారు. దక్షిణ భారతంలో రాయల వారి రాజ్యాలు ఏడు ఉన్నాయని, అందులో ఆంధ్రుడా? కర్ణాటక ప్రాంతానికి చెందిన వాడా? అనే వివాద విషయానికి వస్తే తాను ఆంధ్రుడే అని సమర్థిస్తానని విద్యారణ్య భారతి స్వామి స్పష్టం చేశారు. రాజుల కాలంలో క్షేత్రాధిపతులే అన్ని వ్యవహారాలు చూసే వారని, విశేష కృషి చేసిన ఘనత రాయల వారిదేనని ఆనాటి విరూపాక్ష భువనేశ్వరిదేవి ఆశీస్సులు ఆంధ్రప్రదేశ్‌కు ఉండాలని స్వామిజీ ఆకాంక్ష వెలిబుచ్చారు. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు అందుకుని ప్రసంగించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కె.రోశయ్య పరిపాలన దక్షత పెంపొందించే దిశగా స్వామి వారు ఆశీస్సులు అందించాలని ఆయన అన్నారు. రాష్ట్ర సాంస్కృతిక మండలి ఛైర్మన్ ఆర్.వి.రమణమూర్తి మాట్లాడుతూ, చాతుర్మాస దీక్షలో వెళుతున్న సందర్భంగా విద్యారణ్య భారతి స్వామిజీ విచ్చేసి ఆశీర్వదించడం శ్రీకృష్ణదేవరాయల మహోత్సవాలకు శుభపరిణామం అని అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో రాష్ట్ర రవెన్యూ (దేవాదాయ) ముఖ్య కార్యదర్శి డాక్టర్ కె.వి.రమణచారి, సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ ఎమ్.కాంతారావు, టి.టి.డి హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యదర్శి డాక్టర్ రాళ్లబండి కవితాప్రసాద్ తదితరులు పాల్గొని స్వామి వారి ఆశీస్సులు అందుకున్నారు.

# పద్మజారాణికి 'సౌందర్యరత్న'



ప్రముఖ జ్యోతిష్య పండితురాలు డా॥ ఈడ్పుగంటి పద్మజారాణికి సౌందర్యరత్న బిరుదును ప్రదానం చేస్తున్న కొలకలూరి ఇనాక్

శ్రీత్యాగరాయగానసభ(మేజర్‌న్యూస్) : మాతృభాష కన్నడమైనా తెలుగు చిత్రసీమలో మహిళా ప్రేక్షకులనే కాక ఆబాలగోపాన్ని అలరించి తెలుగు ప్రేక్షకుల గుండెల్లో మరపురాని కథానాయికగా నిలిచిపోయి అకాల మృత్యువాత పడి తీపి గురుతులు మిగిల్చిన సహజ నటి సౌందర్య జయంతిని కళానిలయం, నగర కేంద్ర గ్రంథాలయ సంస్థలు సంయుక్తంగా ఘనంగా నిర్వహించాయి. ఈ వేడుకలలో ప్రముఖ దర్శకులు కె. వీరుకు సౌందర్య స్మారక పురస్కారాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ కవి రచయిత ఆచార్య కొలకలూరి ఇనాక్ విచ్చేయగా ప్రముఖ నటుడు రాజా అధ్యక్షతన సాగిన ఈ వేడుకలను ప్రముఖ నటుడు రాజా జ్యోతి వెలిగించి ప్రారంభించారు.

కాంగ్రెస్ నేత ఎ. కన్నా, ముఖ కవి కన్నోజ్‌లక్ష్మీకాంతంలు అతిథులుగా పాల్గొన్నారు. వివిధ చిత్రాల్లో విశేష నటన కనబరచి తెలుగింటి ఆడపడచుగా ప్రేక్షకులను ఆనందింపజేసిన సౌందర్య గొప్ప నటిగా వెలిగొందిదని అతిథులు ప్రశంసించి ఆమెకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ వేడుకలలో ప్రముఖ జ్యోతిష్య పండితురాలు డా॥ ఈడ్పుగంటి పద్మజారాణిని సౌందర్యరత్న బిరుదు ప్రధానం చేసి ఘనంగా సత్కరించారు. చిత్ర నిర్మాత సురేష్ చౌదరి, దర్శకులు గాజుల నాగేశ్వరరావులకు విశిష్ట పురస్కారాలను అందజేసి సత్కరించారు. ప్రముఖ సంగీత నృత్య గురువు వాణి శిశ్యబృందం ప్రదర్శించిన సంగీత నృత్య కార్యక్రమాలు ఆహుతులకు ఆకట్టుకున్నాయి. కుమారి వైష్ణవి, ప్రణవి, పవిత్ర, శ్రీకృతి, కీబోర్డు మాస్టర్ శ్రీకృష్ణలకు జ్ఞాపికలు అందజేసి అభినందించారు. సంస్థ స్థాపక కార్యదర్శి ఎ. సురేందర్ సభకు స్వాగతం పలికారు. డా॥ కొండాశ్రీనివాస్ కార్యక్రమ సలహాదారుగా, సమన్వయ కర్తగా నిలిచారు.

## శాస్త్రవేత్త బలరామ్‌కు...

# నెహ్రూ అవార్డు

### మహబూబ్‌నగర్ జిల్లా వాసికి అరుదైన గౌరవం



కేంద్ర మంత్రి శరద్‌పవార్ చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న డాక్టర్ మరాఠి బలరామ్

రాజేంద్రనగర్, మేజర్‌న్యూస్ : ఆచార్యఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బయోటెక్నాలజీ విభాగంలో సీనియర్ శాస్త్రవేత్త, మహబూబ్‌నగర్ జిల్లా కొల్లాపూర్‌కు చెందిన డాక్టర్ మరాఠి బలరామ్ ప్రతిష్ఠాత్మక "భారత్ వ్యవసాయ పరిశోధనామండలి జవహర్‌లాల్‌నెహ్రూ అవార్డు" లభించింది. న్యూఢిల్లీలో భారత వ్యవసాయ పరిశోధనామండలివ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేంద్ర వ్యవసాయ శాఖమంత్రి శరద్‌పవార్ చేతుల మీదుగా డా.మరాఠి బలరామ్ అవార్డును అందుకున్నారు. పీహెచ్‌డీ డిగ్రీలో పంటల అభివృద్ధి విభాగంలో ఆయన చేసిన ఉత్తమ పరిశోధనలకుగాను జవహర్‌లాల్‌నెహ్రూ అవార్డును డా.మరాఠి దక్కించుకున్నారు. వరి పంటలో దిగుబడులను పెంచుటకు కారణమైన వివిధ లక్షణాలను ప్రభావితం చేసే క్రోమోజెమ్‌లను గుర్తించడంపై ఆయన పరిశోధనలు చేసినట్లు యూనివర్సిటీ అధికారులు తెలిపారు. భారత వ్యవసాయ పరిశోధనాసంస్థ, పూసా, న్యూఢిల్లీలో జెనెటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్ విభాగంలో సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.కె.సింగ్ ఆధ్వర్యంలో వరి పంటపై డా. బలరామ్ ఈ పరిశోధనలు చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కొల్లాపూర్‌కుచెందిన డా.బలరాం గత 12 సంవత్సరాలుగా ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో శాస్త్రవేత్తగా పని చేస్తున్నారు. అవార్డు అందుకుని తిరిగి వర్సిటీకి చేరిన డాక్టర్ మరాఠి బలరామ్‌ను గురువారం అంగ్రూ ఉపకులపతి డాక్టర్ పి.రాఘవరెడ్డి,డీన్ డా.యలమందారెడ్డి, రిజిస్ట్రార్ డా.జలపతిరావు, అధికారులు , అధ్యాపకులు అభినందించారు.

## రాగాల రసమయ

# శ్రీనివాస గాన మాధుర్యం



శ్రీత్యాగరాయగానసభ(మేజర్‌న్యూస్) : ప్రపంచంలో అన్ని ఆందోళనలకు ఉపశమనం మధురరాగాలు వినడమే. లలిత గీతమైన, శాస్త్రీయ సంగీతమైనా, వాద్య విన్యాసమైనా, చిత్రగీతమైనా, జానపద, భక్తి గీతమైనా మనను సమ్మోహనపరచి ఆత్మానందాన్ని కలిగించేది సంగీతమే. జగత్తంతానాదమయమే. ప్రకృతిలోని ప్రతి కదలిక ఒక రాగరంజిత ఉషస్సే. వికసించే కుసుమం, గలగల పారే సెలయేళ్ళు, నర్తించే నెమళ్ళు, పరుగెత్తే లేళ్ళు, పక్షుల కిల కిలా రావాలు అన్నింటిలోనూ ఆబాల గోపాలాన్ని ఆనందలోకాల్లో విహరింపజేసే రాగమయ సంగీత జగత్తే గోచరిస్తుంది. ఈ స్రవంతిలో తన వంతు పాత్రను పోషించి రాగరంజిత జలదిలో వోలలాడుతూ, నాద పరిమళాలను వెదజల్లుతూ పరివ్యాప్తి చేస్తున్న వారిలో శ్రీవాణి సంగీత కళాశాల వ్యవస్థాపకులు శాస్త్రీయ సంగీత, హార్మోనియం విద్వాంసులు వై. శ్రీనివాసులు 'సూర్య'కు తను సాంప్రదాయ సంగీత పరివ్యాప్తికి చేస్తున్న కృషిని వివరించారు. సంగీత సాహిత్యాలకు స్వర్ణయుగమనిపించిన రాయలసీమలో, అన్నమయ్య తన పద కవితలను పల్లవింపజేసిన నేలలో వికసించిన కుసుమం శ్రీనివాసులు. బాల్యం నుండి సంగీతం, సంగీత వాద్యాల పట్ల మక్కువ పెంచుకొని అంచెలంచెలుగా ఎదిగి పుట్టిన గడ్డకు, కన్నవారికి, గురువులకు గర్వకారణంగా నిలచి ఈ పరంపరను భావితరాలను అందజేయడం ఆయన ఉన్నత సంస్కారానికి ప్రతీక. శ్రీనివాసులు పవిత్రత, ఆధ్యాత్మికత, సౌశీల్యత, సౌభాతృత్వం, సహజీవనం, కర్తవ్య పరాయణం, సాంప్రదాయక కళల పరిరక్షణలో సప్త స్వరాలుగా ముందుకు సాగుతూ జగత్తును నందనవనం చేసి ఆనందమయం చేయాలనే ఆయన ఆకాంక్ష నెరవేరాలని సూర్య అభినందిస్తుంది. ఉచితంగా కీర్తనలు నేర్చుకోదలచినవారు 9849053159 సెల్ నెంబరుపై సంప్రదించి ఈ పవిత్ర కార్యంలో పాలుపంచుకొనవచ్చు.

# భళా.. చిత్రకళ !



**స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో సౌధామిని ప్రదర్శన ప్రారంభం**



**మేజర్‌న్యూస్, సిటీబ్యూరో : చిత్రకారులు చిత్రించే ఎన్నో చిత్రాలు కళాప్రియులకు కనువిందు చేస్తాయి. తమ మదిలోని భావాలకు కుంచెతో రూపం కల్పించి చిత్రకారులు అద్భుతాలను సృష్టిస్తున్నారు. ఎంతోమంది చిత్రకారులు వస్తున్నా ప్రతి ఒక్కరిలోనూ కొత్త దనం కనిపిస్తోంది. ఈ తరుణంలో నగరానికి చెందిన యువ చిత్రకారిణి సౌదామినీ గౌర్ చిత్రించి అపురూప చిత్రాల ప్రదర్శన గురువారం మాదాపూర్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ప్రారంభమైంది. ఈ ప్రదర్శనను సినీ నిర్మాత అడ్డాల చంటి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా చిత్రకారిని సౌదామిని మాట్లాడుతూ తనకు చిత్రకళ పట్ల ఉన్న ఆసక్తితో ఈ చిత్రాలను రూపొందించినట్లు తెలిపారు. ఈ ప్రదర్శన ఈనెల 23వ తేదీ వరకు ఉదయం 10గంటల నుంచి రాత్రి 7గంటల వరకు జంటనగరాల చిత్రకళాప్రియులకు అందుబాటులో ఉంటుంది.**







**పెయింటింగ్స్‌తో చిత్రకారిణి సౌదామిని గౌర్, స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన ప్రదర్శనలో చిత్రాలు**